
# రెండు బాకీలు

మొలకపల్లి కోటేశ్వరరావు



పావనికి రేపే పెళ్ళి చూపులు.

ఇప్పుడు ఆమెకి పాతికేళ్ళు వచ్చాయి.

'ఈ మనువు అయినా కుదిరితే బాగుండు. పిల్లతోటోళ్ళు అందరికీ పెళ్ళిళ్ళయి పిల్లాపాపలు పుట్టి ఆపరేషన్లు కూడా చేయించుకున్నారు. మనరాత ఏం రాతో! మనమ్మాయే ఏ అచ్చటకీ ముచ్చటకీ నోచుకోకుండాపోయింది. మనకి ఆస్థి, డబ్బే లేదు గాని మనపిల్లకేం తక్కువ?'' బయట పంచలో వున్న పొయ్యి దగ్గర కూర్చుని, ఒక పొయ్యిమీద అన్నం, మరో పొయ్యిమీద కూర పెట్టి పుల్లలు ఎగదోస్తూ అంది చెంచమ్మ, ఎదురుగా మంచం మీద కూర్చుని దీర్ఘాలోచనలో మునిగి వున్న భర్త కాంతయ్యతో.

ఆమె మాటలు విన్నా, ఏదో ఆలోచనతో వుండి ఏం మాట్లాడలేదు ఆయన.

''మాట్టాడేది నీతోనే... ఉలకవ్ పలకవేం మొద్దురాచిప్ప మాదిరిగా...''

''ఎహ్హెయిన్నాలేవే నస! ఈ సంబంధం కుదిరినట్టేనని చెప్పలా! మనం ఇస్తామన్న కట్టడికి వాళ్ళు ఒప్పుకున్నారు. అమ్మాయిని సాంప్రదాయకంగా చూట్టమే. చూస్తే, అమ్మాయి నచ్చకుండా ఏం వుండదు. ఇక వాళ్ళనించి ఏం ఆటంకాలు వుండవు. మనక్కూడా అన్నీ నచ్చితే పెళ్ళయిపోయినట్టే!''

'మనకి నచ్చితినేగా రమ్మని కబురు చేసింది. ఇంక మనకి నచ్చాల్సింది ఏముంది?''

''నీకూ నాకూ ఏం లేదు. చేసుకునేది అమ్మాయి. అమ్మాయి క్కూడా నచ్చాలిగా. పిల్లోడు మరీ కారునలుపు. అమ్మాయేమనిద్దో?''

''రంగుదేముందయ్యా?రంగేమన్నా కోసక తింటామా? ముందు గుణం వుండాల. ఎంకయ్యోళ్ళ అల్లుడి ఎవారం చూడు. ఆ పిల్లోడు ఎర్రగా, బుర్రగా, దొరబాబు మాదిరిగా వుంటాడు. కానీ ఏం లాభం? వాడి గుణం గుడిసేటి గుణమంట! రోజూ తాగి రావటమే, రోజూ ఆ పిల్లని చావగొట్టటమేనంట!''

''వాడెవుడో ఒకడు వున్నాడని అందరూ అట్ట వుండరుగా. నలుపుగా వుండేవోళ్ళు తాగేవాళ్ళు లేరా? ఎరుపుకీ, నలుపుకీ, తాగడానికీ ఏం సమ్మంధం? ఈ అబ్బాయి గుణం మంచిదే అంటన్నారు కానీ ఆస్తి ఏం లేదనేదే కొరవ! ప్రయివేటు కంపెనీలో వుజ్జోగం వుంది. మనం ఉజ్జోగాన్ని చూసి పిల్లనియ్యడమే!''

'' ఇయ్యాల అంతకంటే కావాల్సిందేందయ్యా! అమ్మాయి నీడ పట్టున వుండిద్ది. పొలం వుండోడికి ఇచ్చినా ఏం సుకం వుండిద్ది? ఎండకీ, గాలికీ మాడి పోటం తప్ప! పొలాలు మాత్రం ఇయ్యాల ఏం పండి చస్తన్నయ్యి? ఈ మనువు నయం కదూ, గడపదాటి కాలుబైటపెట్టకుండా అమ్మాయి ఇంటి పట్టున వుండిద్ది!'' అంది చెంచమ్మ.

''మనం ఇంకొంత కట్నం ఇయ్యగలిగితే మనమ్మాయి బుద్ధికీ, పుటక్కీ ఎంత మంచి మనువులు వచ్చేయో! పెళ్లి కర్చులు ఇచ్చినా చేసుకుంటామని ఎంతమంది అడిగారూ! మనకాడేమొ కాణీ లేకపోయె, లోకమంతా డబ్బులోనే వుండే!''

'ఏం చేద్దాం? మీ తమ్ముయ్య చేసాడు ఇంత పని! ఆ రాయసూరు పోకపోయినా బాగ బతికేవోళ్ళం. ఉన్న డబ్బుంతా పోగొట్టుకుంటిమీ, అప్పుల పాలైతిమీ, ఒకరికి తలకాయ వంచుకోవాల్సిన కర్మ పట్టే!''

''నువ్వు మాటిమాటికీ వాడ్ని అనవాకవే! పాపం వాడేం చేస్తాడు? మనకి సొంత పొలం లేకపోయె, ఇక్కడ మగతాలు ఎక్కువాయె! పొలం మీదనాలుగు రూపాయలు సంపాయిచ్చుకోవచ్చని రమ్మన్నాడుగానీ, ఇట్టనష్టపోతాం అని వాడేం కలగన్నాడూ? వాడు మన బాగు కోరే రమ్మన్నాడు. కాలం కల్సిరాకపోతే వాడేం చేస్తాడు?''

''సరేగానీ సొసైటీలో డబ్బులు కట్టావుగా! ఇంక ఆ పీడాకారం పోయినట్టేనా?''

''ఎంత మట్టుకి పోటం? ఇయ్యేటికి ఇంక అడగొద్దని చెప్పి వచ్చా! వచ్చే ఏడు కూడా ఎంతో కొంత కట్టాలి. రాయసూరు పోతా సొసైటీలో బాకీ తీసకపోయింది పదేలు. అదిప్పుడు పాతికేలు పైసిలుకు అయింది. ఎవురూరుకున్నా సొసైటీ వోళ్ళు వూరుకోరు!'' అన్నాడు కాంతయ్య.

బయటకి వెళ్ళిన పావని, బయట తొట్టి దగ్గర కాళ్ళు కడుక్కుని ఇంట్లోకి వచ్చింది.

''ఎంతసేపవతందే నువ్వు పోయి! ఇప్పుడు దాకా ఎక్కడ పెత్తనాలు చేస్తుండా?'' కూతుర్ని కోప్పడింది చెంచమ్మ.

''రజనక్కాయి ఏదో మాట్టాడతంటే వాళ్ళింటి దగ్గర ఆగాలేవే! ఇంతలోనే ఏం మునిగిపోయింది?''

''ఏమన్నా మునిగి పోవాలీ? అబ్బా కూతురికి పెత్తనాలకి కొదవలేదు. ఎవారాలంటే చెవులు కోసుకుంటారు. రేపు వాళ్ళు వస్తారు. కొద్దిగా బూజుపొరగొట్టుకుని, ఇల్లూవాకిలీ అలుక్కోవాల్సిన పని వుండే! అసలే జానా బెత్తెడు కొంప. దానికి తోడు గలీసుగా వుంటే, వచ్చినోడు బయటనించి బయటే ఎనక్కి తిరిగి సూడకుండా పోతాడు. కొద్దిగా ఇల్లు బాగుచేసుకుని శుభ్రతగా వుంటే వాళ్ల కంటికి నచ్చిద్ది. వచ్చినోళ్ళు ఒక్కపిల్లనే కాదు, అన్నీ చూస్తారు. అన్నీ నచ్చితేనే చేసుకునేది!''

''సర్లేవే, ఎంతపని బూజుదులుపుకోటం, ఇల్లు అలుక్కోటం!''

''మాటలు అంత తేలిక కాదు, పనికాటం! ఒక పక్కనించి చేస్తంటే అయిపోయిద్దిగానీ, అది ఎంత పని అనుకుంటే అది అక్కడే వుండిద్ది!'' అంది చెంచమ్మ.

''నేను బజారు దాకా పోయొస్తానే!'' అంటూ, కండువా దులిపి భుజానవేసుకుని బయటకి వెళ్ళిపోయాడు కాంతయ్య.

ఈనెలలోపు బాకీ తీర్చావా సరే, లేకపోతే నీ ఇల్లు జప్తుచేస్తాం. నేషనల్ బ్యాంకుల మాదిరిగా కోర్టులకీ, గీర్టులకీ వెళ్ళాల్సిన పని మాకు లేదు. నువ్వు బాకీ వున్నావు కాబట్టి జప్తు చేసే అధికారం మాకు వుంది. నోటీసులు కూడా ఇచ్చేపనిలేదు. ఎక్కడైనా తంటాలు పడు, ఎలాగైనా చేయి, మాకు బాకీ కట్టు. జప్తు చేసి ఇంటినీ, ఇంట్లో సామానునీ వేలం వేసిన తరవాత నువ్వు బాధపడి వుపయోగం వుండదు.

చెంచమ్మ, కాంతయ్య దంపతులకి ఇద్దరు పిల్లలు. కూతురు పెద్ద పావని. ఆమె తమ్ముడు హరిబాబు.

వాళ్ళకి ఒక ఎకరం పొలం వుంది, పదిరోజుల క్రితం వరకూ.

కాంతయ్య వాళ్ళు ఐదుగురు అన్నదమ్ములు. ముగ్గురు అక్కచెల్లెళ్ళు. సగం వూరు వాళ్ళే రక్త సంబంధీకులే.

తొమ్మిదేళ్ళ క్రితం కాంతయ్య ప్రత్తి, మిరప తోటలు వేద్దామని రాయచూరు వెళ్ళాడు.

అంతకుముందే కాంతయ్య తమ్ముడు రాయచూరు వెళ్ళి, పొలాలు వేసి కొద్దిగా సంపాదించుకున్నాడు.

''నువ్వు కూడా రాన్నా! నీటి సౌకర్యం వుంది అక్కడ. లాభాలు వచ్చినా, రాకపోయినా ఇక్కడ మాదిరిగా దండగలురావు. నాల్రూపాయలు మిగుల్తయ్ కానీ తగలవు!'' అన్నాడు అతను.

''నాకూ రావాలనే వుందిగానీ, పెట్టుబడికి సొమ్ము లేదుగదరా?''

'నేను కొంత ఇస్తా. నువ్వు కొంత ఎక్కడైనా తంటాలు పడు.''

''సరే'' అని కాంతయ్య తన దగ్గర పదివేలు డబ్బులు వుంటే అవీ, సొసైటీ కార్యదర్శికి నాలుగు వందలు లంచం ఇచ్చి, పదివేలు లోన్ తీసుకుని ఆ డబ్బుతో కుటుంబంతో కలిసి రాయచూరు వెళ్ళాడు.

కాంతయ్య వెళ్ళిన ఏడాది, పంటలకి ఎక్కువ పురుగు పడింది. ఖర్చులు పెరిగాయి.

దిగుబడులు బాగానే వచ్చినా వాటికి సరైన ధరల్లేవు.

చివరికి పొలంలో పైసా మిగులు కనపడలేదు. భార్యాభర్తలు ఇద్దరూ చేసిన శ్రమ కూడా వ్యర్థమైపోయింది.

కుటుంబ ఖర్చులూ, ఏడాది పొడుగునా అక్కడికీ ఇక్కడికీ తిరిగినందుకు ఛార్జీలూ అదనమయ్యాయి.

తమ్ముడు పెట్టిన పెట్టుబడి వడ్డీలేకుండా తీసుకున్నాడు.

ఇక్కడ చేసిన చిల్లరమల్లర బాకీలూ, సొసైటీ బాకీ అలాగే నిలబడిపోయాయి.

మరుసటి ఏడాది రాయచూరు వెళ్ళడం మానుకున్నాడు.

కూలినాలీచేసి చిల్లర బాకీలు కొంత ఇచ్చి, ఇవ్వలేకా ఇక అవి లేవనిపించుకున్నాడు.

ఇది జరిగి తొమ్మిదేళ్ళు అయింది.

సొసైటీ బాకి ఇంతై అంతై పెరిగిపోయింది.

రెండుమూడేళ్ళుగా సొసైటీ కార్యదర్శీ, బ్యాంకు వాళ్ళూ వచ్చి అడిగి గొడవ చేసి పోతున్నారు. ఈ ఏడాది మొదట్లోనే బ్యాంకు వాళ్ళు కార్యదర్శిని వెంటపెట్టుకుని, జీపు వేసుకుని వచ్చిఅడిగారు.

''ఇంక ఒక నెల రోజులు గడువు ఇస్తున్నాం కాంతయ్య నీకు. ఈనెలలోపు బాకీ తీర్చావా సరే, లేకపోతే నీ ఇల్లు జప్తుచేస్తాం. నేషనల్ బ్యాంకుల మాదిరిగా కోర్టులకీ, గీర్టులకీ వెళ్ళాల్సిన పని మాకు లేదు. నువ్వు బాకీ వున్నావు కాబట్టి జప్తు చేసే అధికారం మాకు వుంది. నోటీసులు కూడా ఇచ్చేపని లేదు. ఎక్కడైనా తంటాలు పడు, ఎలాగైనా చేయి, మాకు బాకీ కట్టు. జప్తు చేసి ఇంటినీ, ఇంట్లో సామానునీ వేలం వేసిన తరవాత నువ్వు బాధపడి వుపయోగం వుండదు. బాకీ మొత్తం కట్టలేకపోయినా కొంతయినా కట్టు'' అని హెచ్చరించి వెళ్ళిపోయారు.

''బ్యాంకులో బాకీ కట్టాలి. అమ్మాయికి పెళ్ళిచేయాలి. చేతిలో అణాలేదు. పిల్లనిస్తామంటే ఎవుడైనా డబ్బే అడుగుతున్నాడు. చేను ఇస్తామంటే ఎంత పనికి మాలినోడు కూడా మూలగటం లేదు. చేను అమ్మి చేతిలో డబ్బు పెట్టుకునే అమ్మాయికి మనువు వెతుకులాడుకోటం నయం!'' అన్నాడు కాంతయ్య భార్యతో.

''ఎకరం చెండ, అదీ తొండలు గుడ్లు పెట్టేది!

దాన్ని ఎంత చేసి కొంటారో, ఏం పాడో! అమ్మకుండా ఇంకో మార్గంలేదు. అమ్ముదాం. ఇయ్యేడు అమ్మాయికి పెళ్ళి చేయాల్సిందే! ఏదో ఒక మనువు. ఇంక ఆగే పనిలేదు'' అంది చెంచమ్మ.

అనుకున్నదే తడవు, పొలం బేరం పెట్టాడు. కాడిగట్టు చేను రైతు 43 వేలు చేసి కొన్నాడు.

వారం రోజుల క్రితం డబ్బు మొత్తం ఇచ్చి అగ్రిమెంటు రాయించుకున్నాడు. అతనికి ఏవో పనులు పడి ఇంకా రిజిస్టర్ కూడా చేయించుకోలేదు.

చేతిలోనికి డబ్బు వచ్చిన తరువాత సొసైటీలో ఏడువేలు జమచేసాడు కాంతయ్య.

అనుకోకుండా కాంతయ్యకి వరసకి చెల్లెలు అయ్యే ఆమె వాళ్ళ వూరు నించి పావనికి మనువు తీసుకొచ్చింది.

వాళ్ళు ముప్పయ్‌వేలు కట్నం అడిగారు. వీళ్ళు ఇస్తామని ఒప్పుకోవటంతో, పెళ్ళి చూపులకి వస్తామని కబురుచేసారు.

బజారుకి బయల్దేరిన కాంతయ్య సెంటర్ దగ్గరకి వస్తుంటే, దారిలో వున్న సొసైటీ ముందు గానుగుచెట్టు నీడలో కుర్చీలేసుకుని కూర్చున్న సొసైటీ కార్యదర్శి, కాంతయ్యని పిలిచాడు.

''ఏం సామీ?'' దగ్గరకి వెళ్ళి కాంతయ్య అడిగాడు.

''నువ్వు ఇచ్చిన డబ్బు బేంకిలో కట్టాను కాంతయ్య. నీ బాకీ ఇరవై ఆరువేలయింది. పదేలు కడితే ఎట్ట? ఇంకొక పదేలు కడితే ఇంక ఇయ్యేటికి ఆగుతారు''

''ఇంకనేను కట్టలేను సామీ. బిడ్డకి పెళ్ళి చేయాలని కూచున్నా. ఇయ్యేటికి వదిలిపెట్టండి సామీ, మీదటికి కడతాను''

''నాదేముంది కాంతయ్యా? నేనూ నీ అసుంటోడ్నే! డబ్బులు నా సొంతమా చెప్పు? పైవాళ్ళు వూరుకోటం లేదు కాంతయ్యా. పదేలు కాకపోయినా ఎంతో కొంత తీసకొచ్చికట్టు. వాళ్ళకి ఎట్నో నచ్చచెప్పి ఇయ్యేటికి రాకుండా ఆపుతా!''

''మొన్న డబ్బులు కట్టేటప్పుడు, ఇంక ఇయ్యేటికి ఇంతేనని చెబితినే సామీ! ఇంక ఇయ్యేటికి అడగొద్దని మొన్న చెబితినే! అప్పుడు గమ్మునుంటివి కదా సామీ!''

''నేను బ్యాంకు వాళ్ళకి చెప్పా. బతిమలాడా! నా మాట యింటారంట కాంతయ్యా వాళ్ళు? నీది నిన్నటి బాకా, మొన్నటి బాకా నువ్వే చెప్పు? నీ కూతురికి పెళ్ళయ్యి, నువ్వు బాకీ తీసుకున్నప్పుడు నీకు మనుమడు పుట్టినట్టయితే ఈ పాటికి వాడు నాలుగైదు తరగతుల్లో వుండేవాడు. ఎంతకాలమో చూడు!''

''నాకు పొర్లకనే కానీ, నేను ఎగేసేవాడ్ని కాను సామీ! మాటకి కట్టుబడి వుండేవాడిని. కాలం కలిసి రాకపోతే ఏం చేయమంటా? రాయసూరుపోటం, అక్కడ దండగలు రాటంతో నా పని తిరగబడింది!''

''నిజమే కాంతయ్యా, దానికి నన్నేం చేయమంటా? అప్పటికే చాలా ఓపిక పట్టాం కదా! మా బ్యాంకు బాగా నష్టాల్లో వుంది. బ్యాంకు ఛైర్మన్ నిలువునా బ్యాంకుని ముంచాడు. పాలఫ్యాక్టరీ అని ఆయన పేరుతోనూ, బినామీ పేర్లతోనూ ఒక కోటీ నలభై లక్షలు జిల్లా బ్యాంకు నించి లోను తీసుకున్నాడు. ఫ్యాక్టరీ లేదూ, పాడులేదు! సొమ్మంతా సొంతానికి వాడుకున్నాడు. ఆయన దెబ్బకి బ్యాంకు దివాలా అయింది. ఆఫీసర్లు ఏమో వసూళ్ళో, వసూళ్ళో అని మమ్మల్ని షంటుతున్నారు. ఛైర్మన్ని అడిగే దమ్ములేదు. వాళ్ళు కూడా కలిసేలే ఈ మొహం చేసింది. చివరికి మేం లోకువ. మమ్మల్ని నిద్రపోనీయటం లేదంటే నమ్ము!'' కార్యదర్శి కంఠశోష వెళ్ళబోసుకున్నాడు.

''అమ్మాయికి మనువు చూసాం. పెళ్ళి కోసమని పొలం కూడా అమ్మేం!''

''పొలం అమ్మేవా? ఒక వేళ నువ్వు రిజిస్టర్ చేసినా అది చెల్లదు. లోన్‌కి సొసైటీలో పెట్టిందేగా ఆ పొలం?''

''అదేను సామీ!''

''అదెట్టా అమ్మే?''

''నాకు వుంది అది ఒకటేగా!''

''సరే కానీ పొలం అమ్మిన డబ్బు వుందిగా. ఇంకొంత కట్టు కాంతయ్యా నామాటిని! నీకు ఇబ్బంది లేకుండా చేస్తా!''

''నేను బ్యాంకు వాళ్ళకి చెప్పా. బతిమలాడా! నా మాట యింటారంట కాంతయ్యా వాళ్ళు? నీది నిన్నటి బాకా, మొన్నటి బాకా నువ్వే చెప్పు? నీ కూతురికి పెళ్ళయ్యి, నువ్వు బాకీ తీసుకున్నప్పుడు నీకు మనుమడు పుట్టినట్టయితే ఈ పాటికి వాడు నాలుగైదు తరగతుల్లో వుండేవాడు. ఎంతకాలమో చూడు!''

''లేదబ్బాయి. అమ్మాయికి పెళ్ళి చేద్దామనే పొలం అమ్మింది. రేపు అమ్మాయిని చూట్టానికి వస్తన్నారు. మే ఇస్తామన్న కట్టానికిక్కూడా వప్పుకున్నారు. ఈ సమ్మంధం దాదాపు కుదిరినట్టే. పెళ్ళికే మాకు డబ్బు సరిపోదు. కొరవ డబ్బు ఎట్ట చేయాల్రా దేవుడా అనుకుంటున్నాం. ఇయ్యేటికి ఇంక కట్టలేనబ్బాయి!''

అని చెప్పి, సెంటర్‌కి వెళ్ళిపోయాడు కాంతయ్య.

***

పావని వాళ్ళు ఎదురు చూస్తుండగా, పెళ్ళికొడుకు వాళ్ళు పెళ్ళి చూపుల కోసం ఆటోలో వచ్చారు.

ఇరుగూ పొరుగూ, దగ్గర బంధువులూ, పావని స్నేహితురాళ్ళూ, అందరూ చేరారు.

పావనిని చక్కగా అలంకరించారు.

సాయంత్రం మూడు గంటలు.

ఒకర్ని ఒకరు చూసుకోవడం అయింది. అటు వైపు వాళ్ళూ, ఇటు వైపు వాళ్ళూ మంచాల మీద కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

ఇంతలో కో ఆపరేటివ్ బ్యాంకు వాళ్ళు జీపు లేసుకుని దిగారు.

ఇంటిముందు ప్రహరీగోడ, తడికాల్లాంటివి ఏమీ లేవు. రావటమే నేరుగా వీళ్ళముందుకి వచ్చారు.

వాళ్ళని చూసి కాంతయ్య గుండెల్లో రాయిపడినట్లయింది.

''రండి రండి...కూచోండి కూచోండి...'' మంచం మీద నించి లేచి భయంగానే వాళ్ళని సాదరంగా ఆహ్వానించాడు.

''మే కూచోటానికి రాలేదు గానీ ఏందీ ఎవారం, చాలామంది ఉండారు?'' తెలియనట్లు అడిగారు.

''అమ్మాయికి మనువు వచ్చింది'' అక్కడ వున్న ఒక పెద్దమనిషి అన్నాడు.

''సరే కాంతయ్యా...పొలం అమ్మేవంటగా! డబ్బు కొంత తీసకొచ్చికట్టు, మేం వెళ్తాం. మేం ఎందుకు ఇక్కడమీకు అడ్డం?''

''పెళ్ళి విషయం మాట్లాడుకుంటాన్నారు. మీరు బాకీ అడగడానికి ఇది సందర్భం కాదు. మీరు తరువాత వచ్చి మాట్లాడుకోండి'' మళ్ళీ అన్నాడు, ఇందాకటి పెద్దమనిషి.

''ఇంతకీ నువ్వెవరివయ్యా?'' మేనేజరు అడిగాడు అధికారపూర్వకంగానూ, అహంకారపూరితంగానూ.

''నేను ఈయనకి అన్నని అవుతాను. మా చిన్నాయన కొడుకే కాంతయ్యా!''

''ఓ హో అలాగా! కాంతయ్యా మా బ్యాంక్‌లో లోన్ తీసుకున్నాడు. ఆ డబ్బు చెల్లిస్తే వెళ్ళిపోతాం''

''మీరు తరువాత వచ్చి మాట్లాడితే బాగుంటుంది. కనీసం రెండుగంటలు ఆగిరండి''

''తరువాత మాట్లాడేదేమిటి, ఆగేదేమిటి? అసలు మాట్లాడటానికి నువ్వెవరివి? నీకు అంత బాధగా వుంటే లోన్ నువ్వు కట్టు, మేం వెళ్తాం!''

''పదేలు కట్టాను సామీ! కట్టిక కూడా వారంకాలా. నిన్ననే సెక్రట్రీ అబ్బాయికి చెప్పాగా, ఇయ్యేటికి ఇంక కట్టలేనని....''

''నువ్వు చెబితే ఎట్ట కుదిరిద్ది? మమ్మల్ని పైవాళ్ళు చంపకతింటన్నారు. ఇంకో పదివేలుకట్టు, వెళ్ళిపోతాం''

''కట్టలేను సామీ''

''మళ్ళీ అదేమాట మాట్టాడితే ఎట్ట? కట్టలేనోడివి బాకీ ఎందుకు తీసుకున్నా? ఎప్పటి బాకీ ఇది? మా దగ్గర నీ పప్పులేం వుడకవు. పొలం కూడ అమ్ముకున్నావు. ఇప్పుడు డబ్బు కడితేనే కదిలేది. లేకపోతే చుట్టాల్లేదూ, పక్కాల్లేదూ, మనువు లేదూ, గినువు లేదూ ఇంటోవున్న చట్టీకుండా, మంచం కంచం బైట వేయడమే!'' మేనేజర్ కఠినంగా, కర్కశంగా, నిర్మొహమాటంగా అన్నాడు.

''రాకరాకపిల్లకి మనువు వచ్చింది. మా పరువు తీయొద్దు సామీ. మీ కాళ్ళు పట్టుకుంటా, మీ కాళ్లకి దండం పెడతా! మీ డబ్బు, పైసలతో కడతాం. ఈ సారికి పొండిసామీ...మమ్మల్ని యాగీ చేయొద్దు!''

అని చెంచమ్మ వాళ్ళ కాళ్ళా వేళ్ళా పడుతూ బతిమాలుకుంటోంది. దండం పెడుతోంది.

''నువ్వారుకోమ్మా!'' అని ఒక వుద్యోగి చెంచమ్మని కసురుకున్నాడు.

పెళ్లిచూపుల కొచ్చిన అబ్బాయితోపాటు, అతని తరఫువాళ్ళూ, కాంతయ్య బంధువులూ అందరూ విచిత్రంగా చూస్తున్నారు.

కాంతయ్యకి ఏం చేయాలో తోచకుండా వుంది. నోట్లో నించి మాట కూడా రావడంలేదు.

బ్యాంకు వాళ్ళు పెద్దపెద్దగా వళ్ళంతా నోరు చేసుకుని అరుస్తున్నారు చేతులూపుతూ దబాయిస్తున్నారు. గట్టిగా మాట్లాడుతున్నారు.

ఈ గోలకి వూళ్ళో వాళ్ళు చాలా మంది చేరారు.

''మీకు బాకీ వుంటే ఇస్తాడు. పక్కన శుభమా అని సమ్మంధం వచ్చి మాట్లాడుకుంటుంటే ఇప్పుడు మీరు వచ్చి గొడవ చేస్తే ఎట్టా?'' వూళ్ళో నించి వచ్చిన ఒకతను గట్టిగా, దబాయించినట్లుగా అన్నాడు.

''అంతే. బాకీ వున్నాడు కాబట్టి అడుగుతున్నాం. మా బాకీ చెల్లిస్తే మాదారిన మేం పోతాం. నువ్వు బాకీ డబ్బు ఇచ్చేవరకూ ఇక్కడ్నించి కదిలేపని లేదు. ఇవ్వాళ బాకీ వసూలు చేసుకునే వెళ్తాం'' అని కదలకుండా హఠం వేసుకుని కూర్చున్నాడు.

అంతకు ముందు రోజు పెయిడ్ సెక్రటరీతో పొలం అమ్మిన విషయం, పెళ్ళి చూపులకి వస్తున్న విషయం చెప్పడంతో అతను వెళ్ళి బ్యాంకు వాళ్ళకి విషయం చెప్పాడు.

''తొమ్మిదేళ్ల నాటి బాకీ ఉంది. ఎకరం పొలం కూడా అమ్మేడు. అమ్మిన డబ్బు చేతిలో పెట్టుకున్నాడు. మొండి బాకి. ఈ సమయంలోనే మనకి బాకీ వసూలయిద్ది. ఇప్పుడు తప్పితే ఇక వసూలు చేసుకోలేం'' అన్నాడు

బ్యాంకు వాళ్ళకి జిల్లా కేంద్ర కార్యాలయంనించి రోజూ తాఖీదులమీద తాఖీదులు వస్తున్నాయి.

''మీ బ్యాంకు పరిధిలో వసూళ్ళు తక్కువగా వున్నాయి. వసూళ్ళలో పురోగతి సాధించకపోతే మీమీద చర్యలు తప్పవు'' అని సారాంశం.

దాంతో వాళ్ళు గ్రామాల మీద పడి రైతుల్ని పీడిస్తున్నారు.

పెయిడ్ సెక్రటరీ చెప్పడంతో బ్యాంకు వాళ్ళు కాచుకుని సరైన సమయమని భావించి వచ్చిపడ్డారు.

అక్కడ చేరిన వాళ్ళు ఎవరు ఎన్ని విధాల చెప్పినా బ్యాంకు వాళ్ళు వినడం లేదు.

''బ్యాంకు పెశిరెంటు కోటీ నలభయి లక్షలు రుణం తీసుకున్నాడుగా! పేపర్లు ఏకేస్తన్నయ్యి. వాడ్ని ఏం చేసినట్టూ?'' ఒక కుర్రవాడు గట్టిగా, పెద్దగా అన్నాడు.

అదే మాట మరో కుర్రవాడు రెట్టించి అడిగాడు.

''అవి పెద్దవాళ్ళ వ్యవహారాలండీ. మాకు తెలియదు. మమ్మల్ని అడిగితే మేమేమి చెప్పేది?''

గోలగోలగా, గొడవ గొడవగా వుంది.

''సరే, మేం వెళ్తాం'' అని పెళ్ళి కొడుకు వాళ్ళు లేచారు.

''మీరు వెళ్ళొద్దు, వుండండి. మాట్టాడుకుందాం'' అని కాంతయ్య పెద్ద అన్న అన్నాడు.

పావని ఇంట్లోకి వెళ్ళి తలుపేసుకుంది.

వాళ్ళ మాటలూ, అరుపులూ వింటున్న పావని స్నేహితురాలు కొద్దిసేపు తరువాత పావని కోసం చూసింది. బైటలేదు.

''పావనీ...పావనీ...'' అని తలుపు దగ్గరకి వెళ్ళి పిలిచింది.

ఇంట్లో వున్న పావని తలుపు తెరవలేదు.

తలుపుకి ఉన్నకన్నం లోంచి చూస్తే పావని లోపల ఉరిపెట్టుకుంటోంది.

''అమ్మో... అమ్మో... పావని ఉరి పోసుకుండాది'' అని ఆస్నేహితురాలు పెద్దగా కేకలు పెట్టింది.

''తలుపు తీయ్...తలుపు తీయ్...'' అని ఎవరు పిలిచినా లోపలనించి మాటాపలుకూ లేదు.

''ఓ నా తల్లో.... నన్ను అన్యేయం చేయకు తల్లో....నువ్వే మాకు దిక్కుతల్లో...'' అంటూ చెంచమ్మ పెద్దపెద్దగా ఏడుపులకి లేచింది.

ఇద్దరు కుర్రవాళ్ళు పరుగున వెళ్ళి పొరుగింట్లో గడ్డపార అందుకుని ఒక్కదెబ్బకి తలుపు పగలకొట్టారు.

లోపల పావని మెడకి తాడు తగిలించుకుని, స్టూలు ఎక్కి ఉచ్చు బిగించుకుంది.

ఒకతను ఒక్క ఉదుటున పావని దగ్గరకి వెళ్ళి, ఆమెని పైకి ఎత్తి ఉచ్చు బిగుసుకోకుండా, స్టూలు కదలకుండా చేసాడు.

''నన్ను వదలండీ...నన్ను వదలండీ...నన్ను చావనీయండీ...'' అని పావని అరుస్తోంది.

అనుకోని సంఘటనకి భయపడి బ్యాంకు వాళ్ళు, ప్రజల చేతుల్లో తమకి మూడిందని భావించి వెళ్ళిపోవడానికి జీప్ ఎక్కారు. ఆ జీప్ కదలకుండా మొరాయించింది. ఎంతకీ స్టార్ట్ కాలేదు.

అక్కడవున్నవాళ్ళు, అసలు బ్యాంకు వాళ్ళ విషయం ఏమిటో తేల్చుకోవాలని సన్నద్ధమవుతున్నారు.

ఇది గమనించిన బ్యాంకు సిబ్బంది జీప్ వదిలి కాలికి బుద్ధిచెప్పారు.

''వాళ్ళు పోతన్నారు. పట్టుకోండ్రా వాళ్ళని. లం...కొడుకుల్ని పట్టుకుని కట్టి పడెయ్యండి ముందు! బాకీ వుంటే అడగడానికి వేళాపాళా లేదా? వదలొద్దు వాళ్ళని. పట్టుకోండి'' అని పది మంది, పది రకాలుగా అంటూ, బూతులు తిడుతూ కర్రలు తీసుకుని తరుముతూ వెంటపడ్డారు.

బ్యాంకు సిబ్బంది కాలి దారినా, పొలాలకి అడ్డు పడీ, చచ్చేదీ బతికేదీ తెలియకుండా వగరుస్తూ రొప్పుతూ తలో దిక్కు పరిగెత్తుతున్నారు. అప్పటికి చాలా దూరం పరిగెత్తారు.

వాళ్ళ వెంట కర్రలతో జనం.

★

